JAYABHERIDAILY.COM
తెలుగు దినపత్రిక
ప్రభాత జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
మేడ్చల్ - మల్కాజిగిరి | మంగళవారం 26-08-2025
Medchal - Malkajgiri | Tuesday 26-08-2025
jayabherinews
సంపుటి : 02 | సంచిక : 93 | పేజీలు : 8 | వెల : 5
Vol. 02 | Issue 93 | Pages : 8 | ₹: 5

కన్నడ బ్యూటీ రుక్మిణి వసంత్ క్రేజ్ మామూలుగా లేదుగా..! యూత్లో క్రేజీ హీరోయిన్గా నిలిచింది. ఈ క్రేజ్కి తగ్గట్టేగానే అవకాశాలు క్యూ కడుతున్నాయి. ప్రస్తుతం, ఆమె చేతిలో మూడు కన్నడ సినిమాలు ఉన్నాయి. ఇందులో కీలక ప్రాజెక్టు కాంతార-ఛాప్టర్ 1 ఒకటి. ఈ సినిమాలో రుక్మిణి 'కనకవతి' పాత్రలో కనిపించనుంది. అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా విడుదలవనున్న ఈ చిత్రం మీద భారీ అంచనాలున్నాయి. ఈ విజయంతో రుక్మిణి కెరీర్ కొత్త మలుపులు తిరుగబోతోంది. తెలుగు, తమిళ, హిందీ భాషలలో అవకాశాలు దక్కించుకునే అవకాశం ఉందంటున్నారు. ఇక, ఈ నేపథ్యంలో రుక్మిణి.. తమిళ ఇండస్ట్రీలోనూ వరుస అవకాశాలు వస్తున్నాయి. అలాగే, ఇక రుక్మిణి తెలుగు మూవీలో నటించనున్నది. జూనియర్ ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఓ మూవీ తెరకెక్కనుండగా.. ఇందులోనూ హీరోయిన్గా ఎంపికైంది.



# అమెరికా 25 నుంచి 50 శాతానికి పెంచుతున్నట్లు ప్రకటన



- అమెరికా 50 శాతం సుంకాలు
- పీఎంవోలో కీలక సమావేశం

**జయభేరి, న్యూఢిల్లీ, ఆగస్టు 25 :**

భారతదేశం నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై అమెరికా సుంకాలను రెట్టింపు చేసింది. ఈ నూతన సుంకాలు ఈ బుధవారం నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ నేపథ్యంలో, తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్న ఎగుమతిదారులకు అండగా నిలిచేందుకు భారత ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ విషయంపై చర్చించేందుకు ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంవో) మంగళవారం, అంటే ఆగస్టు 26న, ఉన్నతస్థాయి సమావేశాన్ని నిర్వహించనుంది. అమెరికా మార్కెట్లోకి వెళ్లే భారతీయ వస్తువులపై ప్రస్తుతం ఉన్న 25 శాతం సుంకాన్ని 50 శాతానికి పెంచుతున్నట్లు వాషింగ్టన్ ప్రకటించింది. ఇదివరకే ఉన్న సుంకాలను భరించలేక, లాభాలు తగ్గిపోయి అంతర్జాతీయ మార్కెట్లో పోటీపడలేకపోతున్నామని ఎగుమతిదారులు వాణిజ్య మంత్రిత్వ శాఖకు విన్నవించారు. ఇప్పుడు ఈ భారం రెట్టింపు కావడంతో వారి పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది. ఈ సమావేశానికి ప్రధానమంత్రి ముఖ్య కార్యదర్శి అధ్యక్షత వహించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఎగుమతిదారులకు ఊరట కల్పించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో ఈ సమావేశంలో చర్చిస్తారు.

...మిగతాది 2 లో

# 3, 4 తేదీల్లో జీఎస్టీ కౌన్సిల్ సమావేశాలు



**జయభేరి, న్యూఢిల్లీ, ఆగస్టు 25 :**

GST కౌన్సిల్ 56వ సమావేశం సెప్టెంబర్ 3, 4 తేదీలలో న్యూఢిల్లీలో జరగనుంది. ఇందులో కేంద్ర ప్రభుత్వం తీసుకురాబోతున్న GST సంస్కరణలపై చర్చించనున్నారు. GST 2.0 పన్ను రేట్లలో పెద్ద మార్పులను కలిగి ఉంది. GST నిర్మాణంలో చేసిన మార్పులు, సామాన్య ప్రజలకు లభించే ఉపశమనం కాకుండా, కౌన్సిల్ ప్రభుత్వం ప్రతిపాదించిన 2రేట్ GST నిర్మాణంపై కూడా ఆలోచిస్తుంది. GST సంస్కరణల కింద 12 శాతం, 28 శాతం స్లాబ్‌లను 5 శాతం, 18 శాతం స్లాబ్‌లలో చేర్చాలనే ప్రతిపాదనను GoM గురువారం ఆమోదించింది. ఇప్పుడు దీనిపై కౌన్సిల్ సమావేశంలో తుది నిర్ణయం తీసుకోనున్నారు. మద్యం, జూదం, పొగాకు వంటి వస్తువులపై 40 శాతం GST విధించాలని కూడా ప్రభుత్వం ప్రతిపాదించింది. ప్రధాని నరేంద్ర మోదీ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా

...మిగతాది 2 లో

# భారీగా పతనమైన ఉల్లి ధరలు



**జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 25:**

రాష్ట్ర వ్యవసాయ రంగంలో కష్టాలన్నీ ఉల్లి రైతులవే అన్నట్లు తయారైంది ప్రస్తుత పరిస్థితి. కష్టపడి పండించడం ఒక ఎత్తు, దాన్ని మార్కెట్‌కు పోయి అమ్ముకోవడం మరో ఎత్తు అన్నట్లుగా ఉంది. మొన్నటి వరకు అధిక ధరలతో ప్రజలకు కన్నీరు తెప్పించిన ఉల్లి.. ఇప్పుడు అమ్ముకునేందుకు రైతును ఏడిపిస్తోంది. ఉల్లి ధర హఠాత్తుగా పడిపోవడంతో ఉల్లి రైతులు లబోదిబోమంటున్నారు.కర్నూలు జిల్లా గోనెగండ్ల మండల పరిధిలో చాలా మంది రైతులు ఉల్లిని సాగు చేశారు. గత కొన్ని రోజులగా అధిక ధర పలకడంతో రైతులు సంతోషంగా ఉన్నారు. ఇంతలోపే హఠాత్తుగా ఉల్లి ధర ఒక్కసారి పాతాళానికి పడిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

...మిగతాది 2 లో



# ముఖ్యమంత్రిని కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే

- గాయపడ్డ వారిని ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిన ఎమ్మెల్యే
- కోటి రూపాయల నగదు, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాడ్ చేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**జయభేరి, ఉప్పల్ :**

రామంతాపూర్ కరెంట్ షాక్ ఘటనలో ఆరుగురు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బాధితులకు న్యాయం చేయాలంటూ వారు కోరడం జరిగింది. గోకుల్ నగర్ లో శ్రీకృష్ణ శోభాయాత్రలో విద్యుత్ షాక్ తో 5 గురు మృతి చెందడం బాధాకరం అని ఎమ్మెల్యే తెలిపారు. మృతులు రాజేంద్రరెడ్డి, వికాస్,

...మిగతాది 2 లో

# ఒక్క లాఠీ పడినా చూస్తూ ఊరుకోం



**జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 25:**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉస్మానియా యూనివర్సిటీ పర్యటన సందర్భంగా విద్యార్థులను ముందస్తుగా అరెస్ట్ చేయడాన్ని రాష్ట్ర మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు తీవ్రంగా ఖండించారు. ఇది అప్రజాస్వామికం, పిరికిపంద చర్య అని ఆయన వ్యాఖ్యానించారు. వెంటనే విద్యార్థులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. "ఒక్క విద్యార్థిపై లాఠీ పడినా తెలంగాణ సమాజం చూస్తూ ఊరుకోదు.

...మిగతాది 2 లో




# తెలంగాణ వాసుల గళం ఉస్మానియా

తెలంగాణ చరిత్రకు సజీవ సాక్ష్యమైన ఉస్మానియా యూనివర్సిటీని ప్రపంచంలోనే ఒక అద్భుతమైన విద్యాలయంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. తెలంగాణ చరిత్రను నిక్షిప్తం చేసిన, తెలంగాణ పదానికే ప్రత్యామ్నాయంగా నిలిచిన ఉస్మానియా విశ్వవిద్యాలయ అభివృద్ధికి ఎంత చేసినా తక్కువే అవుతుందని అన్నారు.

- ఉస్మానియా యూనివర్సిటీ కాలగర్భంలో కలవొద్దు
- ఈ వర్సిటీ చరిత్రకు సజీవ సాక్ష్యం
- ఉస్మానియా కోసం వెయ్యి కోట్లు ఖర్చు
- ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల కోసం 20 వేల కోట్లు
- యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి 500 కోట్లు
- స్పోర్ట్స్ యూనివర్సిటీ, పోలీస్ స్కూల్ కోసం వందల కోట్లు ఖర్చు
- ఉస్మానియా యూనివర్సిటీలో పర్యటించిన సీఎం రేవంత్ రెడ్డి

**జయభేరి, హైదరాబాద్ :**

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థినీ విద్యార్థుల కోసం నూతన హాస్టల్ భవనాలు, లైబ్రరీ రీడింగ్ రూమ్ నిర్మాణాలకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. అలాగే, కొత్తగా నిర్మించిన దుందుభి, భీమ హాస్టల్ భవనాలకు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ కాలేజీ ఠాగూర్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. ఒక అద్భుతమైన వర్సిటీగా తీర్చిదిద్దడానికి ఇంజనీరింగ్ నిపుణులు, విద్యా శాఖ నిపుణలతో ఒక కమిటీని నియమించి సమగ్రమైన అంచనాలు రూపొందించాలని విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణాని ఆదేశించారు. స్టాన్‌ఫోర్డ్, ఆక్స్‌ఫర్డ్ వర్సిటీల ప్రమాణాలను మించి ప్రపంచంతో పోటీ పడే విధంగా తీర్చిదిద్దడానికి ఎన్ని నిధులైనప్పటికీ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు.

"విద్యా రంగానికి ఈ ఏడాది 40 వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టాం. ఉస్మానియా కోసం వెయ్యి కోట్లు ఖర్చు చేయడానికి ఇబ్బందేమీ లేదు. రాష్ట్రంలో వంద నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల కోసం 20 వేల కోట్లు, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి 500 కోట్లు, స్పోర్ట్స్ యూనివర్సిటీ, పోలీస్ స్కూల్ కోసం వందల కోట్లు ఖర్చు పెడుతున్నాం.
ఉస్మానియా యూనివర్సిటీ కాలగర్భంలో కలవొద్దు. ఈ వర్సిటీ చరిత్రకు సజీవ సాక్ష్యంగా నిలవాలి. ప్రపంచ ప్రమాణాలతో అద్భుతమైన వర్సిటీగా రూపొందించడానికి ఏం కావాలో అడగండి. రాష్ట్ర సాధనలో ముందు భాగంలో నిలబడిన ఈ యూనివర్సిటీని గాలికొదిలేయడం సరికాదు. ఈ యూనివర్సిటీకి మరోసారి వస్తా. ఈసారి ఆర్ట్స్ కాలేజీ ఎదురుగా సభ పెట్టుకుందాం. యూనివర్సిటీని

...మిగతాది 2 లో

# గృహ నిర్బంధంలో జగదీప్ ధన్‌ఖడ్..?

- ఖండించిన అమిత్ షా

**జయభేరి, న్యూ ఢిల్లీ, ఆగష్టు 25 :**



ఉపరాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ అనూహ్యంగా రాజీనామా చేసిన విషయం తెలిసిందే. అనారోగ్య కారణాలతో తన పదవికి రాజీనామా చేశారు. అయితే, ధన్‌ఖడ్ రాజీనామాపై ప్రతిపక్షాలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. మరోవైపు రాజీనామా తర్వాత నుంచి ఆయన ఎక్కడా కనిపించడం లేదు. ఆయన్ని కలిసేందుకు పలువురు రాజ్యసభ సభ్యులు ప్రయత్నించినా ఎలాంటి ఫలితం లేదు. ఆయన్ని సంప్రదించలేకపోతున్నారు. దీంతో 'జగదీప్ ధన్‌ఖడ్ ఎక్కడ..?' అంటూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. ధన్‌ఖడ్ గృహనిర్బంధంలో ఉన్నారంటూ ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో ధన్‌ఖడ్ రాజీనామాపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా తాజాగా స్పందించారు. ఈ మేరకు 'హౌస్ అరెస్ట్' వార్తలను తీవ్రంగా ఖండించారు.

# ప్రతిభ చూపిన ఎస్సీ, ఎస్టీ రెసిడెన్షియల్ విద్యార్థులు



- ఐఐటీ, నిట్, నీట్‌లో రాష్ట్రం నుంచి 55 మంది ఎంపిక
- సీఎం చంద్రబాబును కలిసి సంతోషాన్ని పంచు కున్న విద్యార్థులు
- వచ్చే ఏడాది నాలుగు రెట్ల ఫలితాలు రావాలని సీఎం ఆకాంక్ష
- సీట్లు పొందిన ఒక్కో విద్యార్థికి ప్రోత్సాహకంగా రూ.లక్ష

**జయభేరి, అమరావతి, ఆగస్ట్ 25 :**

ఆంధ్రప్రదేశ్ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో చదివి ఈ ఏడాది ఐఐటీ, నిట్, నీట్‌లో విజయం సాధించిన విద్యార్థులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందించారు. ఐఐటీ, నిట్, నీట్‌లో సీట్లు సాధించిన 55 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసి రాష్ట్ర ప్రభుత్వం అందించిన ప్రోత్సాహానికి కృతజ్ఞతలు తెలిపారు. తమ సంతోషాన్ని ముఖ్యమంత్రితో పంచుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన ముఖ్యమంత్రి... మరింతగా కష్టపడి ఉన్నత చదువుల్లోనూ ప్రతిభ చూపాలని సూచించారు. భవిష్యత్‌ను ఉజ్వలంగా తీర్చిదిద్దుకోవడంతో పాటు... రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## తెలంగాణ వాసుల గళం ఉస్మానియా

అభివృద్ధి చేయడంలో నాకు చిత్తశుద్ధి ఉంది. అంచనాలు రూపొందించండి. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక భాగస్వామ్యం తీసుకున్న ఎంతో మంది విద్యార్థులు, నాయకులు ఇక్కడి నుంచి వచ్చిన వారే. తెలంగాణ సమాజానికి సమస్యలున్నా, సంక్షోభం వచ్చినా మొదట చర్చ జరిగేది ఉస్మానియా నుంచే ఆ సమస్య మాది అని భావించేదే ఈ నిలయం. ఎంతో ఘన చరిత్ర కలిగిన ఉస్మానియాను కాలగర్భంలో కలిపేయాలన్న కుట్ర జరుగుతున్న సందర్భంలో ఈ వర్సిటీకి పూర్వ వైభవం కల్పించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఏర్పడిన మరుక్షణం ఆలోచనలు చేశాం. రాష్ట్రంలోని యూనివర్సిటీలు అన్నింటినీ చదువులకే కాకుండా సామాజిక చైతన్య వేదికలుగా మార్చాలన్న ఆలోచనతో నిర్ణయాలు తీసుకున్నాం. ఉస్మానియా వర్సిటీ 108 ఏళ్ల చరిత్రలో దళితుడు వైస్ చాన్సెలర్ కాలేదు. ప్రస్తుతం వీసీ మొలుగరం నైపుణ్యాన్ని గుర్తించి వీసీగా నియమించాం. అలాగే మిగతా యూనివర్సిటీలు, విద్యా కమిషన్‌కు అలాగే నియమించాం. వర్సిటీలు ఉద్యోగులు, అధికారులను ఉత్పత్తి చేయడానికి మాత్రమే కాకుండా తెలంగాణ పునర్నిర్మాణానికి అవసరమైన మేధాసంపత్తిని అందిస్తుందని ఆశిస్తున్నాం. దేశ జనాభాలో 35 ఏళ్ల లోపు వయసున్న యువత 65 శాతం ఉంది. యువత శాసనసభకు పోటీ చేయాలంటే 25 ఏళ్ల వయ పరిమితిని 21 సంవత్సరాలకు ఎందుకు తగ్గించకూడదో ఆలోచన చేయాలి. యూనివర్సిటీలు చదువులకు మాత్రమే పరిమితం కాకుండా పరిశోధనలకు వేదిక కావాలి. సైద్ధాంతిక పరమైన భిన్నాభిప్రాయాలపై చర్చలు జరగాలి. సాంకేతిక పరమైన చర్చలు జరగాలి. వర్సిటీలు, విద్యాలయాల్లో సిద్ధాంతపరమైన పోరాటాలు, సామాజిక చైతన్య ఉద్యమాలు లేని కారణంగా చిన్న చిన్న కాలేజీల్లో కూడా విద్యార్థులు గంజాయి సేవించడం లాంటి వ్యసనాల బారిన పడటానికి దారితీస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో పంచడానికి భూములు లేవు. ఖజానాలో ఖాళీగా ఉంది. దళితులు, గిరిజనులు, బడుగు బలహీన వర్గాలకు నా సూచన ఒక్కటే నాణ్యమైన విద్య ఒక్కటే మన తలరాతలను మార్చగలుగుతుంది. విద్యార్థినీ విద్యార్థుల సమస్యలు పరిష్కరించడానికే ఇక్కడికి వచ్చాను. సమస్యలు పరిష్కరించడానికి వచ్చినప్పుడు వ్యతిరేకించడం ద్వారా అభివృద్ధిని అడ్డుకున్న వారవుతారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలో 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశాం. ఉపాధ్యాయ నియామకాల కోసం కేవలం 55 రోజుల్లో 11 వేల మంది టీచర్లను నియమించాం. వచ్చే ఆరు నెలల్లో ఇంకో 40 వేల ఉద్యోగాలను భర్తీ చేస్తాం. అధికారం చేపట్టి రెండున్నరేళ్ల కాలం నాటికి లక్ష ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తాం. ప్రైవేటు రంగంలో వేల కోట్ల పెట్టుబడులను తేవడమే కాకుండా 1.5 లక్షల ఉద్యోగాలు ప్రైవేటు రంగంలో కల్పించాం. అపోహలకు లోను కావద్దు. అనుమానాలు ఉంటే నివృతి చేస్తాం. అబద్దాలను నమ్మకండి. కొందరు జీర్ణించుకోలేక ప్రతిదానికి అడ్డుపడుతున్నారు. అలాంటి వారు తెలంగాణ సమాజానికి ముసుగేసుకున్న చెదల్లాంటి వారు. ఉస్మానియా వర్సిటీని ఉంచకూడదని, ఎవరూ చదువుకోవద్దని కోరుకునే వారు. 2034 నాటికి తెలంగాణ 1 ట్రిలియన్ డాలర్, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదగాలంటే మీరంతా చదువుకోవాలి. చదువు ఒక్కటే ఈ సమాజాన్ని మార్చగలదు.." అని ముఖ్యమంత్రి సవివరంగా మాట్లాడారు.

## ఎస్సీ, ఎస్టీ రెసిడెన్షియల్ విద్యార్థులు

'విద్యార్థులను అత్యుత్తమంగా తీర్చిదిద్దేలా సాంఘిక సంక్షేమ విద్యాసంస్థలు రూపుదిద్దుకోవాలి. రాష్ట్రంలోని విద్యార్థుల్లో ప్రతిభకు కొదవలేదు. వారికి సరైన వసతులు, ప్రోత్సాహం అందిస్తే ప్రపంచంలో అందరితో పోటీ పడే సత్తా ఉంది. ఇందుకు 55 మంది విద్యార్థులే నిదర్శనం. సాంఘిక సంక్షేమ విద్యాసంస్థల నుంచి జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు ఎంపికయ్యే విద్యార్థుల సంఖ్య వచ్చే ఏడాదికి నాలుగు రెట్లు పెరగాలి. ఇప్పుడు ర్యాంకులు సాధించిన విద్యార్థులు తాము చదువుకున్న పూర్వ విద్యాసంస్థకు వెళ్లి అక్కడ విద్యార్థుల్లో స్ఫూర్తి నింపాలి.' అని ముఖ్యమంత్రి విద్యార్థులతో అన్నారు.

కర్నూలు జిల్లా చిన్నటేకూరు, ఎన్టీఆర్ జిల్లా కుంటముక్కల, గుంటూరు జిల్లా అడవి తక్కెళ్లపాడులోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఐఐటీనీట్ సెంటర్లలో వీరంతా కోచింగ్ తీసుకుని ర్యాంకులు సాధించారు. ఈ సెంటర్లలో జేఈఈ మెయిన్ అండ్ అడ్వాన్స్‌డ్‌లో 176 మంది శిక్షణ పొందగా 129 మంది క్వాలిఫై అయ్యారు. నీట్‌కు 180 మంది కోచింగ్ తీసుకోగా 143 మంది క్వాలిఫై అయ్యారు. చివరగా ఐఐటీలో 12 మంది, నిట్‌లో 30 మంది, నీట్ ఎంబీబీఎస్‌లో 13 మంది విద్యార్థులు సీట్లు సాధించారు. మొత్తం 55 మంది విద్యార్థుల్లో 20 మంది విద్యార్థినులు ఉండటం విశేషం. వీరు కాకుండా బీడీఎస్‌లో మరో 14 మందికి సీట్లు వచ్చే అవకాశం ఉంది. జీఎఫ్‌టీఐ, సెంట్రల్ యూనివర్సిటీల్లో 19 మందికి సీట్లు లభిస్తాయి.

ఈ ఏడాది కొత్తగా మరో 7 ఐఐటీనీట్ కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. కొత్తగా ఏర్పాటు చేసే సెంటర్లతో 1,411 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుంది. మొత్తం 55 మంది విద్యార్థులకు రూ.55 లక్షలు ఇచ్చారు. విద్యార్థులు అంతా పేదరికం నుంచి వచ్చి ఉత్తమ ప్రతిభ చూపడంతో ముఖ్యమంత్రి సంతోషం వ్యక్తం చేశారు. సమావేశం చివరిలో బోధనా సిబ్బంది, విద్యార్థులు ముఖ్యమంత్రితో గ్రూపు ఫోటో తీసుకున్నారు. ఈ సమావేశంలో మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, అధికారులు పాల్గొన్నారు.

## ఒక్క లాఠీ పడినా చూస్తూ ఊరుకోం

ఇందుకేనా విద్యాశాఖ, హోంశాఖలను మీ వద్ద ఉంచుకున్నది?" అని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. "ఓయూ విద్యార్థులు మాత్రమే కాదు, యావత్ తెలంగాణ మీ మోసపూరిత హామీల గురించి నిలదీస్తోంది. మొత్తం సమాజం మీద నిషేధాజ్ఞలు విధిస్తారా? ఏడోగ్యారంటీ పేరుతో ప్రజాస్వామ్యం చెప్పి, ఎమర్జెన్సీ రోజులను తిరిగి తెచ్చారు రేవంత్ రెడ్డి," అని ఎద్దేవా చేశారు. తెలంగాణ సీఎంగా కేసీఆర్ సమయంలో ఇచ్చిన ఉద్యోగాల నియామక పత్రాలు ఇవ్వడం, కేసీఆర్ హయాంలో ప్రారంభించిన నిర్మాణాలను పూర్తి చేయడం తప్ప 22 నెలల పాలనలో ముఖ్యమంత్రి ఏమి సాధించలేదని హరీశ్ రావు విమర్శించారు. "జాబ్ క్యాలెండర్‌ని జాబ్‌లెస్ క్యాలెండర్‌గా మార్చారు. మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాల మోసం చేసారు. నిరుద్యోగ భృతి పేరిట వంచన చేశారు. 22 నెలల్లో 10 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వకుండా 60 వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారు," అని ఆరోపించారు. "విద్యార్థులు, నిరుద్యోగులు ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమే లైబ్రరీల్లో పోలీసు లాఠీ చార్జీలు జరిపించి, విద్యార్థులు, నిరుద్యోగుల వీపులు పగుల గొట్టిన చరిత్ర కలిగినదని హరీశ్ రావు పేర్కొన్నారు. "ఆంక్షలతో, నిషేధాలతో నిరుద్యోగుల నిరసన జ్వాలను ఆర్పలేరు. ఇనుప కంచెలు, బ్యారికేడ్లతో ప్రజా తిరుగుబాటును ఆపలేరు. పోలీసు బలంతో విద్యార్థుల గళాన్ని అణగదొక్కలేరు" అని హరీష్ రావు స్పష్టం చేశారు. "ఉస్మానియా విద్యార్థులు, నిరుద్యోగులు సింహాల్లా గర్జిస్తారు. విద్యార్థులకు క్షమాపణలు చెప్పి, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ పక్షాన మేము డిమాండ్ చేస్తున్నాం," అని హరీశ్ రావు హెచ్చరించారు.

## ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే

శ్రీకృష్ణ, శ్రీకాంత్, సురేష్ యాదవ్ లకు సహాయం అందజేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఉస్మానియా యూనివర్సిటీకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలవడం జరిగింది. అలాగే గాయపడ్డ వారిని పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని వారిని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలి అని ఆయన అన్నారు. వారు కోలుకునే వరకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించాలని ఆయన సూచించారు. వారికి అన్ని విధాలా అండగా ఉంటాను అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## భారీగా పతనమైన ఉల్లి ధరలు

పుట్టపాశం గ్రామంలో ఉన్న రైతులు శ్రీనివాసులు, గోపాల్, సుంకన్న, రైతులు సుమారు ఎకరాకు 70 వేలు పెట్టుబడి పెట్టి ఉల్లి సాగు చేస్తే, ఎకరాకు 25 క్వింటాలు దిగుబడి వచ్చిందన్నారు. ఉల్లిని అమ్మడానికి వెళితే ధర రూ.500 కూడా లేదని, కనీసం రూ.20 వేలు కూడా రావాడం లేదని ఉల్లి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉల్లికి కుళ్లిపోయే గుణం ఎక్కువ. ఎప్పటికప్పుడు గ్రేడింగ్ చేయాలి. అలా చేస్తేనే వ్యాపారులు కొనుగోలు చేస్తారు. గ్రేడింగ్ చేయించుకోవడానికి అదనంగా ఖర్చు చేయాల్సి వస్తుందోని, రోజువారీ వ్యాపారాలు జరగకపోవడంతో తరుగు పేరుతో 5 నుంచి 10 క్వింటాళ్ల సరుకు పారబోయాల్సి వస్తోందన్నారు. గ్రేడింగ్ చేసినందుకు కూలీలకు అదనంగా డబ్బులు చెల్లించాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగైదు రోజులైనా ఉల్లి కొనుగోళ్లు జరగకపోవటంతో మార్కెట్‌లో పడిగాపులు కాయడంతోపాటు భోజనాలకు అదనపు ఖర్చులు చేయాల్సి వస్తోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఉల్లి రైతులకు గిట్టుబాటు ధర కల్పించి, ఉల్లి కొనుగోలు చేయాలని రైతులు వేడుకుంటున్నారు. లేకపోతే తాము అప్పుల పాలవుతామని రైతులు వాపోయారు.


# అక్షరాల చరిత్రకారుడు సాహిత్య జ్యోతి సురవరం

**తెలంగాణ చరిత్రలో ఆత్మగౌరవం కోసం గళమెత్తిన గొంతుల్లో ముందువరసలో నిలిచినవాడు సురవరం ప్రతాపరెడ్డి. ఆయన పేరు వింటేనే సాహిత్యం, చరిత్ర, పత్రికా రంగం, ఉద్యమం అన్నీ మన ముందుకొస్తాయి. ఒకే మనిషి అంత విభిన్న రంగాల్లో కృషి చేయడం అరుదు. కానీ సురవరం జీవితం అలా అనేక కోణాల్లో వెలుగులు విరజిమ్మిన దీపస్తంభం. తెలంగాణకు స్వరమిచ్చిన వాగ్దేవత లాంటి వ్యక్తి. అతని పుట్టుక మహబూబ్ నగర్ జిల్లా గద్వాల సంస్థానంలో 1896 మే 28న జరిగింది. చిన్న వయసులోనే తండ్రిని కోల్పోవడం వల్ల చిన్న నాన్న రామకృష్ణారెడ్డి సాన్నిధ్యంలో పెరిగాడు. బాల్యంలో ఏ బి ఎన్ మిషనరీ పాఠశాలలో చదువు మొదలయి, తర్వాత హైదరాబాదు నిజాం కాలేజీలో ఉన్నత విద్య కొనసాగాడు. విద్యలో పదునైన తపన కారణంగా మద్రాసులో కూడా చదువుకున్నాడు. అదే సమయంలో జాతీయోద్యమ ప్రభావం ఆయన మనసును ఆకర్షించింది. భాష అంటే అభిమానం, చరిత్ర అంటే తపన, సాహిత్యం అంటే సమాజానికి వెలుగునిచ్చే కాంతి అని ఆయన నమ్మకం.**

✍ **జయభేరి, హైదరాబాద్ :**

హైదరాబాద్‌లో తెలుగు భాషను తగ్గించేందుకు పరిస్థితులు ఏర్పడుతున్నప్పుడు, భాష మనిషికి శ్వాస లాంటిదని ఆయన బలంగా నమ్మాడు. ఆ నమ్మకంతోనే 1921లో ఆంధ్ర జన సంఘాన్ని స్థాపించాడు. అదే సమయంలో "గోల్కొండ" అనే పత్రికను ప్రారంభించాడు. సంపాదకులు లేకపోవడంతో అన్ని బాధ్యతలు ఆయనే చేపట్టాడు. వ్యాసాలు రాయడం, పత్రిక ముద్రణ, పాఠకులకు చేరవేయడం అన్నీ తనే చూసుకున్నాడు. కానీ ఆ కష్టం ఫలించి "గోల్కొండ" తెలంగాణ గళమైంది. సాహిత్యం మీద మక్కువ, చరిత్ర మీద పట్టుదల కలిసినప్పుడు ఆయన "గోల్కొండ కవుల సంచిక" అనే అపూర్వ గ్రంథాన్ని వెలువరించాడు. తెలంగాణలో కవులు లేరని కొందరు అన్నప్పుడు, ఆయన ఆ మాటకు సమాధానం అక్షరాల్లో రాశాడు. మొత్తం 354 కవుల జీవిత విశేషాలను సేకరించి, వారిని ప్రపంచానికి పరిచయం చేశాడు. ఇది కేవలం పుస్తకం కాదు, తెలంగాణ సాహిత్యానికి అద్దం పట్టిన చరిత్ర.

రాజకీయ రంగంలో కూడా అడుగుపెట్టిన సురవరం వనపర్తి నియోజకవర్గం నుంచి శాసనసభకు ఎన్నికయ్యాడు. కానీ ఆయన అసలు కృషి పత్రికా రచయితగా, సాహితీవేత్తగా గుర్తింపు పొందింది. "ఆంధ్రుల సాంఘిక చరిత్ర" అనే గ్రంథానికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించడం ఆయన ప్రతిభకు నిదర్శనం. "హైందవ ధర్మ వీరులు", "భక్త తుకారాం", "ఉచ్ఛల విషాదము" వంటి నాటకాలు, "మొగలాయి కథలు" అనే కథాసంపుటి ఆయన అక్షరయజ్ఞానికి ఉదాహరణలు. తెలంగాణ చరిత్రలో సురవరం ప్రతాపరెడ్డి పేరు ఒక సజీవ శకము. ఆయన లేకపోతే తెలుగు భాషా స్వరానికి ఆ కాలంలో గళం ఉండేది కాదు. 1953 ఆగస్టు 25న ఆయన దివంగతుడయ్యాడు. కానీ ఆయన రాసిన అక్షరాలు, ప్రారంభించిన ఉద్యమాలు, నిలిపిన చరిత్ర తెలంగాణని జీవంగా నిలబెట్టాయి. ప్రస్తుతకాలంలో తెలంగాణ సాహిత్య, చరిత్ర రంగాలపై జరిగే పరిశోధనలకు ఆయన రచనలు ఆధారంగా ఉన్నాయి. అనేక విశ్వవిద్యాలయాలు ఆయన గ్రంథాలను పాఠ్యాంశాలుగా చేర్చుకున్నాయి. తాజాగా కొన్ని పరిశోధకులు ఆయన లేఖలు, పత్రికా వ్యాసాలను సేకరించి కొత్త రూపంలో వెలువరించే ప్రయత్నం చేస్తున్నారు. ఇది ఆయన ఆలోచనలకు కొత్త శ్వాసనిస్తోంది. సురవరం ప్రతాపరెడ్డి ఒక వ్యక్తి మాత్రమే కాదు, ఒక దిశ చూపిన జ్యోతి. తెలంగాణ చరిత్రలో ఆయన స్థానాన్ని ఎప్పటికీ ఎవరు భర్తీ చేయలేరు. అక్షరాలు, భాష, చరిత్ర, ఉద్యమం అన్నింటినీ ఒకే మడిలో కలిపి మనకు అందించిన మహానుభావుడు సురవరం.



1953 ఆగస్టు 25న ఆయన దివంగతుడయ్యాడు. కానీ ఆయన రాసిన అక్షరాలు, ప్రారంభించిన ఉద్యమాలు, నిలిపిన చరిత్ర తెలంగాణని జీవంగా నిలబెట్టాయి. ప్రస్తుతకాలంలో తెలంగాణ సాహిత్యం, చరిత్ర రంగాలపై జరిగే పరిశోధనలకు ఆయన రచనలు ఆధారంగా ఉన్నాయి.

✍ డా. చిటికెన కిరణ్ కుమార్
యుఎన్ఐసిసిడిఆర్ పురస్కార గ్రహీత
ప్రముఖ సాహితీవేత్త, విమర్శకులు
ఐబిఆర్ఎఫ్ సభ్యులు
సెల్: 9490 841 284

## 3, 4 తేదీల్లో జీఎస్టీ కౌన్సిల్ సమావేశాలు

దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ GST రేట్లను తగ్గించే హామీ ఇచ్చారు. ఈ దీపావళి నాటికి దేశంలోని సామాన్య పౌరులకు ఇది చాలా ఉపయోగకరంగా ఉంటుందని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం వస్తువులు, సేవల పన్ను సవరించిన వ్యవస్థలో కేవలం రెండు పన్ను రేట్లను ప్రతిపాదించింది 5 శాతం, 18 శాతం. దీనితో పాటు, 12 శాతం, 28 శాతం పన్ను స్లాబ్ రద్దు చేస్తారు. ప్రస్తుతం 0 శాతం, 5 శాతం, 12 శాతం, 18 శాతం, 28 శాతం కలిగిన నాలుగు స్లాబ్‌లు ఉన్నాయి, వీటిని తగ్గించి కేవలం స్టాండర్డ్, మెరిట్ అనే రెండు స్లాబ్‌లు మాత్రమే ఉంచుతారు. దేశంలో ఉపాధి కల్పన రంగాన్ని ప్రోత్సహించడానికి, GST పన్ను నిర్మాణంలో 5 శాతం కంటే తక్కువ ప్రత్యేక స్లాబ్ ఉంచుతారు. దీనితోపాటు, 40 శాతం స్లాబ్ కూడా ప్రతిపాదనలో ఉంది. ఇందులో ఐదు నుంచి ఏడు హానికరమైన వస్తువులు ఉంటాయి. ప్రతిపాదన ప్రకారం, 12 శాతం స్లాబ్‌లో చేర్చిన 99 శాతం వస్తువులు 5 శాతం స్లాబ్‌లోకి వస్తాయి. అదేవిధంగా, 28 శాతం స్లాబ్‌లో ఉన్న 90 శాతం వస్తువులు 18 శాతం స్లాబ్‌లోకి మారుస్తారు. చిన్న కార్లపై GSTని 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గిస్తారని భావిస్తున్నారు, దీనివల్ల వాటి ధరలు తగ్గుతాయి. ఆర్థిక మంత్రిత్వ శాఖ రెండురేట్ల GST నిర్మాణ ప్రతిపాదనను GST కౌన్సిల్ ఆమోదించిన తర్వాత, ఉప్పు, బుజియా, స్నాక్స్, నూడుల్స్, వెన్న, నెయ్యి వంటి సాధారణంగా ఉపయోగించే వస్తువుల ధరలు తగ్గుతాయి. ప్రభుత్వ వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం, "సామాన్య ప్రజలు వినియోగించే ఆహారం, విద్యకు సంబంధించిన అన్ని అవసరమైన రోజువారీ వినియోగ వస్తువులు సున్నా లేదా 5 శాతం GST స్లాబ్‌లోకి వస్తాయి."

## అమెరికా 25 నుంచి 50 శాతానికి పెంచుతున్నట్లు..

కరోనా సమయంలో ప్రవేశపెట్టిన ఎమర్జెన్సీ క్రెడిట్ లైన్ గ్యారెంటీ స్కీమ్ తరహాలో ఒక పథకాన్ని తీసుకురావాలని ఎగుమతిదారులు కోరుతున్నారు. అయితే, అందరికీ ఒకే తరహా సాయం అందించడం కంటే, తీవ్రంగా నష్టపోతున్న కొన్ని ప్రత్యేక రంగాలను గుర్తించి వాటికి నేరుగా సాయం చేయడమే మేలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. క్లస్టర్ల వారీగా వర్కింగ్ క్యాపిటల్ ఫండ్స్ ఏర్పాటు చేసే ఆలోచన కూడా పరిశీలనలో ఉంది. "చిన్న సంస్థలకు ఆస్తుల హామీతో కూడిన రుణ సదుపాయాలు కల్పిస్తే ప్రయోజనకరంగా ఉంటుందని మైక్రో పరిశ్రమల ప్రతినిధులు అభిప్రాయపడ్డారు" అని ఓ అధికారి తెలిపారు. విదేశీ మార్కెట్లలో వచ్చే మార్పుల వల్ల ఎక్కువగా నష్టపోయే చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ఆదుకోవడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అధికారులు స్పష్టం చేశారు. మంగళవారం జరగనున్న సమావేశంలో భారత ప్రభుత్వం తీసుకోబోయే సహాయక చర్యలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.


**ట్రంప్ ప్రభుత్వ నిర్ణయం, భారత్ స్పందన:**

రష్యాఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపేందుకు మాస్కోపై తీవ్ర ఆర్థిక ఒత్తిడి తీసుకురావడంలో భాగంగానే భారత్‌పై 50 శాతం భారీ సుంకాలను విధించామని అమెరికా స్పష్టం చేసింది. ఈ చర్య ద్వారా రష్యా ఆర్థిక మూలాలను దెబ్బతీయడమే తమ ప్రధాన లక్ష్యమని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ వెల్లడించారు. ఈ వ్యూహాత్మక నిర్ణయంపై ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు.. "రష్యా తన చమురు ఆర్థిక వ్యవస్థ ద్వారా లాభపడకుండా కట్టడి చేసేందుకే అధ్యక్షుడు ట్రంప్ భారత్‌పై ద్వితీయ శ్రేణి సుంకాల వంటి కఠినమైన ఆర్థిక చర్యలు తీసుకున్నారు" అని వివరించారు. ఉక్రెయిన్‌లో మారణహోమాన్ని ఆపివేస్తే, రష్యాను తిరిగి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలోకి ఆహ్వానిస్తామని... లేకపోతే ఆ దేశం ఏకాకిగానే కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. గత కొన్ని వారాల్లో ఇరు దేశాల నుంచి సానుకూల స్పందనలు వస్తున్నాయని, రష్యాఉక్రెయిన్ మధ్య శాంతిని నెలకొల్పగలమని వాన్స్ విశ్వాసం వ్యక్తం చేశారు. రష్యా నుంచి భారత్ తక్కువ ధరకు ముడి చమురును కొనుగోలు చేయడాన్ని అమెరికా తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ నేపథ్యంలోనే, ఈ నెల ప్రారంభంలో భారత ఉత్పత్తులపై సుంకాలను 50 శాతానికి పెంచుతున్నట్లు ట్రంప్ ప్రభుత్వం ప్రకటించింది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు అదనంగా 25 శాతం సుంకాన్ని ఇందులో చేర్చారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడం ద్వారా ఆ దేశం చేస్తున్న యుద్ధానికి భారత్ ఆర్థికంగా మద్దతు ఇస్తోందని అమెరికా ఆరోపిస్తుండగా... భారత్ ఈ ఆరోపణలను తీవ్రంగా ఖండించింది. కేవలం జాతీయ ప్రయోజనాలు, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగానే తమ ఇంధన కొనుగోళ్లు ఉంటాయని భారత్ తేల్చి చెప్పింది. ఈ విషయంపై శనివారం నాడు ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో విదేశాంగ మంత్రి జైశంకర్ ఘాటుగా స్పందించారు. "వ్యాపార అనుకూల ప్రభుత్వం అని చెప్పుకునే అమెరికా, ఇతరులు వ్యాపారం చేస్తుంటే ఆరోపణలు చేయడం వింతగా ఉంది. మీకు మా నుంచి చమురు లేదా శుద్ధి చేసిన ఉత్పత్తులు కొనడంలో సమస్య ఉంటే కొనకండి. మిమ్మల్ని ఎవరూ కొనమని బలవంతం చేయడం లేదు" అంటూ గట్టి కౌంటర్ ఇచ్చారు.

## సబ్సిడీ నుంచి స్కూటర్ వరకు

- మెప్మా సహకారం, ర్యాపిడో చొరవతో ఉపాధి పొందిన 1003 మహిళలు
- తొమ్మిది నగరాల్లో సేవలు.. 3 నెలల్లో రూ.35 లక్షల ఆదాయం
- మహిళా సాధికారతే ప్రాధాన్యమన్న మంత్రి నారా లోకేష్

✍ **జయభేరి, అమరావతి :**



ఆంధ్రప్రదేశ్ మహిళలు సరికొత్త మార్గంలో పయనిస్తున్నారు. మెప్మా సహకారంతో స్వయం ఉపాధి పొందుతూ వారి కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నారు. చేతిలోని స్మార్ట్ ఫోన్ ఉపయోగిస్తూ, ఎలక్ట్రిక్ స్కూటర్ నడుపుతూ సొంతంగా సంపాదిస్తున్నారు. రాష్ట్రంలోని విజయవాడ, విశాఖపట్నం, నెల్లూరు తదితర నగరాల్లో మహిళలు కేవలం ఇంటికే పరిమితం కాకుండా సొంత కాళ్లపై నిలబడేందుకు ర్యాపిడో ద్వారా కుటుంబానికి అదనపు ఆదాయం సమకూర్చుకుంటున్నారు.

**'ఒక కుటుంబం – ఒక వ్యాపారవేత్తే' స్ఫూర్తి**

మహిళల స్వయం ఉపాధికి తొలి అడుగు ఈ ఏడాది మార్చి 8న, అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పడింది. అదే రోజున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించడంతో మొదలైంది. ముఖ్యమంత్రి మానస పుత్రికగా ప్రారంభించిన "ఒక కుటుంబం.. ఒక వ్యాపారవేత్త" కింద మిషన్ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ పావర్టీ ఇన్ మునిసిపల్ ఏరియాస్ (మెప్మా) సంస్థ ర్యాపిడో ద్వారా మహిళలకు ఎలక్ట్రిక్ వాహనాలు అందించింది. అందులో భాగంగా తొలి దశలో తొమ్మిది పట్టణాల్లో 1000 మంది లబ్ధిదారులకు రుణ సౌకర్యం కల్పించారు. వీటిలో విశాఖపట్నంలో 400 వాహనాలు, విజయవాడలో 400, నెల్లూరు, గుంటూరులో 50 చొప్పున, కర్నూలు, తిరుపతి, కాకినాడ, రాజమండ్రిలో 25 వాహనాలు చొప్పున మహిళలకు అందజేశారు. వీటిలో 760 ఎలక్ట్రిక్ టూవీలర్లు కాగా, 240 ఎలక్ట్రిక్ త్రీవీలర్లు ఉన్నాయి.

**డ్వాక్రా, మెప్మా సహకారంతో..**

ఈ వాహనాలు కొనుగోలు చేసేందుకు అవసరమైన బ్యాంకు రుణాలు డ్వాక్రా సంఘాల మహిళల పేర్లతో మంజూరయ్యాయి. డ్రైవింగ్ లైసెన్స్ లేని వారికి వారి కుటుంబ సభ్యులు వాహనం నడిపేందుకు అవకాశం కల్పించారు. ఇందుకోసం అవసరమైన ప్రాజెక్ట్ రిపోర్టులను మెప్మా సిద్ధం చేసి, జాతీయ బ్యాంకుల ద్వారా రుణాలు పొందేలా సహకారం అందించింది. ఈ క్రమంలో ర్యాపిడో సైతం మహిళలకు సాధికారతనందించడంలో భాగస్వామ్యం కావడం విశేషం. కొత్తగా చేరిన వారికి ప్లాట్‌ఫామ్ ఫీజులో మూడు నుంచి నాలుగు నెలల మినహాయింపు ఇచ్చారు. అలాగే తొలి సంవత్సరం టూవీలర్, త్రీవీలర్ యజమానులకు నెలకు వెయ్యి రూపాయల ఈఎంఐ మొత్తాన్ని సాయంగా అందించారు. దీంతో ర్యాపిడో నడపడం ప్రారంభించిన గృహిణులకు తొలి రోజు నుంచే ఆదాయం ప్రారంభమైంది. అలాగే ఈఎంఐ, ఇంధన భారం కూడా తగ్గింది. దీనిలో భాగంగా ఇప్పటివరకు 1003 కుటుంబాలు లబ్ధి పొందగా, వారిలో 688 మంది ర్యాపిడోలో నమోదు అయ్యారు.

**ఇది ఆరంభం మాత్రమేనన్న మంత్రి లోకేష్**

మహిళలు సాధికారత సాధించాలనేది ప్రభుత్వ ఆలోచన అని విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. తెలుగుదేశం పార్టీ మహిళా రిజర్వేషన్లను ప్రవేశ పెట్టడంతోపాటు, అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు. ర్యాపిడోతో కలిసి రాష్ట్రంలో 1000 మందికి పైగా మహిళలు స్వీయ ఉపాధి సాధించినందుకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇది ఆరంభం మాత్రమేనని, రాబోయే రోజుల్లో మరింత చేస్తామని మంత్రి నారా లోకేష్ వివరించారు.

# స్కాలర్షిప్ బకాయిలను విడుదల చేయ్యాలి




- ప్రభుత్వాలు మారుతున్న విద్య వ్యవస్థ తీరు మారదం లేదు

**జయభేరి, దేవరకొండ :**

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ దేవరకొండ శాఖ ఆధ్వర్యంలో సోమవారం రోజున 8300 కోట్ల స్కాలర్షిప్ ఫీజు రీయింబర్ విడుదల చేయాలని ప్రెస్ మీట్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నల్గొండ విభాగ్ హాస్టల్స్ కన్వీనర్ యలమల గోపీచంద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్మెంట్, స్కాలర్షిప్పులను విడుదల చేయాలని ఏబీవీపీ నల్లగొండ విభాగ్ హాస్టల్స్ కన్వీనర్ యలమల్ల గోపీచంద్ తెలిపారు. సంవత్సరాల తరబడి ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్స్ విడుదల చేయని కారణంగా దాదాపు 8,300 కోట్లకు ఏర్పడి పెండింగ్లో ఉన్నాయని, నూతనంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన రెండు సంవత్సరాలు కావొస్తున్న పెండింగ్ బకాయిలను చెల్లించకుండా విద్యార్థుల జీవితాలు పట్ల నిర్లక్ష్యం చేస్తూ పేద విద్యార్థుల జీవితాల పట్ల శాపంగా మారారని మండిపడ్డారు. పేద విద్యార్థులకు సంజీవని వంటి ఫీజు రీయింబర్స్మెంట్ ,స్కాలర్షిప్ పథకాలకు తూట్లు పొడుస్తూ విద్యార్థుల హక్కు అయినటువంటి ఫీజు రియంబర్స్మెంట్లను విడుదల చేయకపోవడం అనేది పేద విద్యార్థులకు విద్యను దూరం చేసే దిశగా ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు. ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ పూర్తి చేసిన వేలమంది విద్యార్థులకు ఫీజు రియంబర్మెంట్ స్కాలర్షిప్ రాని కారణంగా యాజమాన్యాలు ఫీజు రియంబర్మెంట్ వస్తే కానీ సర్టిఫికెట్స్ ఇవ్వమంటూ విద్యార్థుల ఒత్తిడికి గురి చేస్తున్న యజమాన్యాలపై ప్రభుత్వం కనీసం పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. ఒకవైపు రియంబర్మెంటు బకాయిలు చెల్లిస్తే తప్ప మేము కళాశాలలో నడవలేని స్థితిలో ఉన్నామని ప్రైవేటు యాజమాన్యాలు మొర పెట్టుకుంటున్నారని, ఫీజు రియంబర్స్మెంట్ పైన ఆధారపడి నడిపిస్తున్న కళాశాలలు వందల సంఖ్యలో ఉన్నాయని, మధ్యలోనే కళాశాల యాజమాన్యాలు చేతులెత్తే పరిస్థితి కనిపిస్తుందన్నారు. ఇటు యాజమాన్యానికి అటు ప్రభుత్వానికి మధ్యలో బలవుతున్నది విద్యార్థులేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ పూర్తి అయిన తర్వాత కూడా సర్టిఫికెట్స్ రాక ఒకవైపు ఉన్నత విద్యకు మరొకవైపు ఉద్యోగ అవకాశాలు వచ్చినా కూడా సర్టిఫికెట్స్ లేని కారణంగా విద్యార్థుల జీవితాలు అంధకారంలోకి నెట్టి వేయబడుతున్నాయన్నారు.

ప్రభుత్వం హాస్టల్స్ లో సరైన మౌలిక వసతులు లేక రాష్ట్రంలో పూటకు ఒకచోట ఫుడ్ పాయిజన్స్ తో విద్యార్థుల జీవితాల పై రాష్ట్ర ప్రభుత్వం చలగాటమాడుతు నిర్లక్ష్యంగా వివరిస్తుంది. ప్రభుత్వాలు మారుతున్న విద్య వ్యవస్థ తీరు మారడం లేదని, విద్యార్థుల జీవితాలు బాగుపడటం లేదని ఉన్న విద్యాలయాలను విద్యా వ్యవస్థను పటిష్ట పర్చాల్సిన ప్రభుత్వమే విద్యను అంధకారంలోకి నెట్టి వేస్తూ నూతనంగా ఇంటర్నేషనల్ స్కూల్స్ అంటూ యూనివర్సిటీలు అంటూ కొత్త హామీలతో చేతులు దులుపుకుంటుందే తప్ప ఇచ్చిన హామీలు మాత్రం అమలు చేయడం లేదన్నారు. ప్రభుత్వానికి విద్యారంగం పట్ల ఉన్న చిత్తశుద్ధి ఏంటో విద్యారంగానికి కేటాయించిన బడ్జెట్లోనే అవగతం అవగతం అయిందన్నారు. సంవత్సరాల తరబడి అధికారులకు వినతిపత్రాలు ఇస్తున్న అనేక కార్యక్రమాలు చేస్తున్న ప్రభుత్వానికి మాత్రం చీమకుట్టినట్టు కూడా లేదన్నారు. ప్రభుత్వం ఇచ్చేటటువంటి ఫీజు రియంబర్మెంట్ స్కాలర్షిప్స్ విద్యార్థుల యొక్క హక్కు అని జ్ఞప్తికి తెచ్చుకొని ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి. ప్రభుత్వ హాస్టల్లో మౌలిక వసతులు కల్పించాలి. రాష్ట్రంలో జరుగుతున్న అక్రమడ్డి కొటేషన్స్ లబ్బాయి చర్యలు తీసుకోవాలి. ఏబీవీపీ డిమాండ్ చేస్తుందన్నారు. లేనియెడల రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులందరినీ కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపడతామని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఈ ప్రభుత్వానికి హెచ్చరిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర కార్యవర్గ సభ్యులు విక్రమ్, భూష రాజు ఈశ్వర్, దమ్ముజు అమితేష్, సుశాంత్, చిన్ను, హనుమంత్ తదితరులు పాల్గొన్నారు.



## ఉచితంగా మట్టి వినాయకుని విగ్రహాలు పంపిణీ కార్యక్రమం

**జయభేరి, పరవాడ :**

పరవాడ రాంకీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాంకీ కమర్షియల్ హబ్ సమీపంలో ఉన్న శ్రీ రాజరాజేశ్వరి ఆలయం వద్ద మంగళవారం ఉదయం 9.30 గంట నుండి ఉచితంగా మట్టి వినాయకుని విగ్రహాలను పంపిణీ చేయనున్నట్లు రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ డాక్టర్ శ్రీకాంత్ సోమవారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. చుట్టు గ్రామాల ప్రజలు, ఫార్మా పరిశ్రమలకు వచ్చే కార్మికులు ఉద్యోగులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలను పూజించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కోరారు.

## విద్యుత్ షాక్ తో పాడి గేదె మృతి



**జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు 25:**

విద్యుత్ షాక్ తో పాడి గేదె మృతి చెందిన ఘటన తుర్కపల్లి మండలం నాగయిపల్లి గ్రామంలో సోమవారం జరిగింది. వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన ఎల్లమైన బిక్షపతి రోజు మాదిరిగా తన పాడి గేదెలను మేతకు మేపడానికి వెళ్లే క్రమంలో పొలం ప్రక్కన గల ట్రాన్స్ఫార్మర్స్ వద్ద ఉన్న పచ్చిక గడ్డిని మేస్తుండగా కరెంట్ షాక్ కొట్టి గేదె అక్కడికక్కడే మృతి చెందిందని ఆవేదన వ్యక్తం చేశారు..రోజుకు సుమారు 6 లీటర్ల పాలు ఇచ్చే లక్ష రూపాయల విలువగల పాడిగేదే మృతిచెందడంతో బాధిత కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.తమ జీవనోపాధి దెబ్బతిన్నదని ప్రభుత్వం, అధికారులు, పాలకులు తమను ఆదుకోవాలని ఆవేదన వ్యక్తంచేశారు.

# ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించాలి

- ఆటో కార్మికుల కోసం జరిగే ధర్నాను జయప్రదం చేయండి
- సిఐటియు పిలుపు




**జయభేరి, పరవాడ:**

మండల కేంద్రమైన పరవాడ లో సంత బయలు వద్ద ఆటో కార్మికులతో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఆటో కార్మికులు కి ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 28న పరవాడ తాసిల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నా చేయాలని గని శెట్టి ఆటో కార్మికులకు పిలుపునిచ్చారు.

నిరుద్యోగులుగా ఉంటూ ప్రభుత్వం ఉపాధి కల్పించకపోయినా అనేకమంది వ్యవసాయం లాభసాటిగా లేకపోవడంతో ప్రైవేట్ ఫైనాన్స్ దగ్గర అప్పులు చేసి బ్యాంకుల దగ్గర లోన్ తీసుకొని ఆటోలు కొనుగోలు చేసి ప్రతినెల ఫైనాన్సర్లకి కిస్తీచెల్లిస్తూ పిల్లల చదివించుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. రాష్ట్రంలో సుమారు పది లక్షల మంది ఆటో డ్రైవర్లకు స్వయం ఉపాధి పొందుతున్నారు. ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం వలన బేరాలు తగ్గాయి. ఉపాధికి దెబ్బతింటుంది. ఉచిత బస్సు ప్రయాణానికి ఆటో కార్మికులుగా మేము వ్యతిరేకం కాదు. ఎన్నికల్లో ఆటో కార్మికులకు ఇచ్చిన హామీల అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఆటో కార్మికులకు డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న ప్రతి ఆటో కార్మికుడికి వాహన మిత్ర పథకం కింద సంవత్సరానికి 25000 ఇచ్చి ఆదుకోవాలి. ఇప్పటికే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ పై విధించిన వాట్ వ్యాట్ తగ్గించాలి. 2019లో గత ప్రభుత్వం తీసుకు వచ్చిన జీవో నెంబర్ 21 రద్దు చేయాలి. అన్ని రకాల పెంచిన ఫీజులు పెనాల్టీలు తగ్గించాలి. ఇన్సూరెన్స్ ప్రీమియం తగ్గించాలి.వాహన కొనుగోలుకి బ్యాంకుల ద్వారా నాలుగు లక్షల రూపాయలు సబ్సిడీతో కూడిన వడ్డీ లేని రుణాలు మంజూరు చేయాలి. పట్టణ మండల కేంద్రాల్లో ఆటోలకు పార్కింగ్ స్థలాలు కేటాయించాలి.వాహన ఫిట్నెస్ ఏ టి ఎస్ ఆటో మేటిక్ ట్రాక్ ప్రైవేటు ఇవ్వడం రద్దు చేయాలి. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన న్యాయసహితే డ్రైవర్లకు భారీ పెనాల్టీలు జైలు శిక్షలు పిఎన్ఎస్ 106 (1)&2 సెక్షన్లు రద్దు చేయాలి. పార్లమెంట్లో ఎంపీలు దీనికోసం డిమాండ్ చేయాలి. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

# రైతుల పక్షాన నిరసన తెలిపిన బీఆర్ఎస్ మండల నాయకులు




**జయభేరి, పీఏపల్లి :**

పీఏ పల్లి మండలం అంగడిపేట హైవే మీద బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా భూభారతి చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ప్రజల నుండి తీసుకున్న దరఖాస్తులను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో ధర్నా వల్లపు రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పీఏ పల్లి ఉమ్మడి మండల అధ్యక్షుడు వల్లపురెడ్డి, అంజిరెడ్డి మాట్లాడుతూ గత కెసిఆర్ ప్రభుత్వ హాయంలో భూ సమస్యల పరిష్కారానికై తీసుకువచ్చిన ధరణి సరిగా లేదని ధరణి పేరును రద్దుచేసి కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి చేసిన చట్టం పుల్ల ప్రజలకు ఎటువంటి జరగడం లేదని ఆరోపించారు. కేవలం పేరు మార్చారే తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదని అన్నారు. మండలంలో భూభారతి చట్టంపై జరిగిన అవగాహన సదస్సులో భాగంగా భూ సమస్యలు పరిష్కారానికై ప్రజల నుండి పెద్ద ఎత్తున దరఖాస్తులు స్వీకరించారని, అట్టి దరఖాస్తులను కొన్ని నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు పరిష్కరించడం లేదని ఆరోపించారు. నూతనంగా ఏర్పడిన పీఏ పల్లి మండలానికి భూ సమస్యల పరిష్కారం పట్ల అవగాహన లేని తహసిల్దార్ ను నియమించారని, మండల రెవెన్యూ అధికారులు రైతుల భూ సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యారని ఆరోపించారు. భూ సమస్యల పరిష్కారానికి కొంత గడువును కేటాయించి, గడువు లోపల పరిష్కరించేటట్లుగా ఉన్నతాధికారులు చొరవ తీసుకోవాలని కోరారు. తాసిల్దార్ కార్యాలయంలో పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించి రైతులకు మండల ప్రజలకు సేవలు అందించే విధంగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికైనా పెండింగ్లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించాలని లేనియెడల భవిష్యత్తులో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు. రైతులకు తగినంత యూరియా అందించాలని గత పది సంవత్సరాల్లో యూరియా కొరత ఎప్పుడు లేదని రైతులు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు అర్వపల్లి నరసింహ, ఎర్ర యాదగిరి, సుధాకర్ గౌడ్, మహేందర్ తో పాటు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అనంతగిరిలో మంత్రి జూపల్లి పర్యటన

**జయభేరి, వికారాబాద్ :**

వికారాబాద్ కేంద్రంలో పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అనంతగిరి హరిత రిసార్ట్స్, అనంతగిరి వ్యూ టవర్ ప్రాంతాన్ని ప్రత్యేకంగా సందర్శించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హరిత రిసార్ట్స్ పైలెట్ ప్రాజెక్ట్ వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ కి అప్పగించినట్లు తెలిపారు. అయితే, ప్రైవేట్ రిసార్ట్స్ అందించే సౌకర్యాలకు ఏమాత్రం తగ్గకుండా హరిత రిసార్ట్స్ ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయాలని మంత్రి స్పష్టం చేశారు.

ఈ అభివృద్ధి ద్వారా వికారాబాద్ పరిసర ప్రాంతాల యువతీ యువకులకు ఉద్యోగావకాశాలు విస్తరించడంతో పాటు, ప్రభుత్వానికి ఆదాయ వనరులు పెరిగి, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి తోడ్పడతాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ కి తక్షణమే చర్యలు తీసుకొని, హరిత రిసార్ట్స్ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని సూచించారు. పర్యాటక దృష్టిలో వికారాబాద్కు ఉన్న ప్రత్యేకతను ఉపయోగించుకొని, అనంతగిరి పర్వతాల అందాలు, హరిత రిసార్ట్స్ సౌకర్యాలు, వ్యూ టవర్ కు ఆకర్షితులవుతారని మంత్రి పేర్కొన్నారు.



## బెస్ట్ లైబ్రేరియన్ గొన్న ఇంజనీరింగ్ కళాశాల లైబ్రేరియన్ శ్యామలరావు

**జయభేరి, పరవాడ:**

మద్రాస్ లైబ్రేరియన్ అసోసియేషన్ ప్రతి సంవత్సరం ప్రకటించే బెస్ట్ లైబ్రేరియన్ అవార్డు ఈ సంవత్సరం గొన్న ఇంజనీరింగ్ కళాశాల లో లైబ్రేరియన్ గా పని చేస్తున్న ఆకెళ్ళ శ్యామలరావు కు ఉత్తమ లైబ్రేరియన్ అవార్డు మద్రాస్ లైబ్రేరి అసోసియేషన్ సెక్రటరీ డాక్టర్. కె. నిత్యానందం చేతులు మీదుగా చెన్నైలో అన్న సెంటినరీ లైబ్రరీ అందుకొన్నారు. లైబ్రేరియన్ గా చేసిన కృషి కి ఈ గుర్తింపు లభిచిందని శ్యామలరావు అన్నారు. ఈ సందర్భంగా శ్యామలరావు కు మద్రాస్ లైబ్రరీ అసోసియేషన్ వారు బెస్ట్ లైబ్రేరియన్ సర్టిఫికెట్, మెమెంటో అందచేశారు. ఈ అవార్డు రావడం తో లైబ్రరీ కి చేసిన కృషి కి మంచి గుర్తిపు లభించిందని శ్యామలరావు అన్నారు. కళాశాల సెక్రటరీ హేంచంద్ నాయుడు, ప్రిన్సిపాల్ మూర్తి, తోటి ఆచార్యులు శ్యామలరావు కు అభినందనలు తెలియచేసారు.

## అసభ్యంగా ప్రవర్తించిన కీచక లెక్చరర్ పై కఠిన చర్యలు తీసుకోవాలి




**జయభేరి, పరవాడ:**

పరవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కెమిస్ట్రీ లెక్చరర్ శనివారం నాడు ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని పై లైంగిక దాడికి ఒడికట్టాడు. దీనిపై తక్షణమే పోలీస్ వారు కేసు నమోదు చేసి బాధిత బాలికకు న్యాయం చేయాలని కోరారు. విద్యార్థి సంఘం నాయకులుతో కళాశాలలో చదువుతున్న విద్యార్థులు వాళ్ళ ఎదుర్కొంటున్న అనేక సమస్యలు దృష్టికి తీసుకువచ్చారు అని అన్నారు. దీనిపై పరవాడ సీఐ మల్లికార్జున మాట్లాడుతూ కేసు నోమోదు చేసి దాని పై తక్షణమే చర్యలు తీసుకొంటాము అన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో విఫలమైన ప్రభుత్వం



**జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు 25:**

ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బిజెపి జిల్లా నాయకుడు వట్టిపల్లి శ్రీనివాస్ అన్నారు. తుర్కపల్లి మండలం మల్కాపురం గ్రామం నుండి తుర్కపల్లి మండల కేంద్రం లోని తహసిల్దార్ కార్యాలయం వరకు బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పాదయాత్రను నిర్వహించారు .అనంతరం తహసిల్దార్ దేశ నాయక్ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుర్కపల్లి మండల కేంద్రంలో 250 ఎకరాల్లో ఐటీ పార్క్, 100 పడకల ఆసుపత్రి నిర్మాణం, మండలంలోని బస్తీ దావఖానాల సమస్యలను పరిష్కరించి సౌకర్యాలను పెంచి, డాక్టర్లను అందుబాటులో ఉంచాలని, గంధ మల్ల ప్రాజెక్టు కింద భూములు కోల్పోతున్న రైతులకు ఎకరానికి 45 లక్షలు చెల్లించాలని అన్నారు .ఈ కార్యక్రమంలో నాయకులు ఆకుల సైదులు, చాంద్ పాషా ,బొల్లు నరసింహ యాదవ్, మాలోతు రమేష్ నాయక్, జక్కుల వెంకటేష్, గుండెబోయిన మల్లేష్ ,శంకర్ నాయక్, ఏడుమూల ఆంజనేయులు ,మోత్కుపల్లి బిక్షపతి ,మేకల లావణ్య, మేకల పాండు యాదవ్ ,ఆకుల భాస్కర్, మహేష్ యాదవ్ పాల్గొన్నారు.

## రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఉచిత మట్టి గణపతుల పంపిణీ




**జయభేరి, చింతపల్లి :**

నేడు మధ్యాహ్నం రెండు గంటలకు చింతపల్లి మండల కేంద్రంలో చింతపల్లి రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత మట్టి గణపతుల పంపిణీ కార్యక్రమం ఉంటుంది. పర్యావరణాన్ని రక్షించాలని ఉద్దేశంతో ఉచిత మట్టి గణపతులు భక్తులకు అందజేస్తామని ప్రతి ఒక్కరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చింతపల్లి మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వందనపు ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలియజేసినారు.

## యూరియా కోసం రైతులతో కలిసి సిర్పూర్ ఎమ్మెల్యే ధర్నా

**జయభేరి, కాగజ్ నగర్:**

కాగజ్ నగర్ పట్టణంలోని వ్యవసాయశాఖ మార్కెట్ ముందు, భట్పల్లి చౌరస్తా వద్ద యూరియా కోసం సిర్పూర్ శాసన సభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు రైతులతో కలిసి ధర్నాకు దిగారు. సకాలంలో రైతులకు యూరియా అందడం లేదని మండిపడ్డారు. యూరియా కొరత ఉందని పడిగాపులు గాసినా యూరియా సరఫరాలో రేవంత్ రెడ్డి సర్కార్ విఫలం అయింది . యూరియా సక్రమంగా సరఫరా చేసేంత వరకు ఇక్కడి నుండి వెళ్లేది లేదని అన్నారు. వ్యవసాయశాఖ మార్కెట్ ముందు ప్రధాన రహదారిపై రైతులతో కలిసి రోడ్డు మీదఅయన నిరసన తెలిపారు. దీంతో వాహనాలు ఇరువైపుల భారీగా నిలిచిపోయాయి.




## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన ఘటనపై విచారణ చేపట్టాలి

జయభేరి, పరవాడ:

మండల కేంద్రం అయ్యిన పరవాడ జూనియర్ కళాశాలలో సెకండ్ ఇయర్ విద్యార్థిని పై సైన్స్ లెక్చరర్ ప్రవర్తనపై సమగ్ర విచారణ చేపట్టి కఠినంగా శిక్షించాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా ఆధ్వర్యంలో సోమవారం జూనియర్ కాలేజీ ఎదుట ఆందోళన చేపట్టారు. అనకాపల్లి జిల్లా పరవాడ మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైన్స్ లెక్చరర్ జి శ్రీధర్ ని సమగ్రమైన విచారణ జరిపి కఠినంగా శిక్షించాలని ఐద్వా అనకాపల్లి జిల్లా అధ్యక్షులు పి మాణిక్యం డిమాండ్ చేశారు. ఇంటర్ సెకండియర్ చదువుతున్న అమ్మాయి మీద ఆ కాలేజీ సైన్స్ లెక్చర్ జి శ్రీధర్ అమ్మాయిని లైంగికంగా వేధించి బ్యాడ్ టచ్ గురిచేయడం అన్యాయం పోక్స్కొ చట్టం కింద అరెస్టు చేయాలని అమ్మాయి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని అమ్మాయికి ఉద్యోగం కల్పించాలని పరవాడ మండలంలో ఇటువంటి ఘటన జరగడం దుర్మార్గమని అన్నారు. దీనిపై పరవాడ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నాం అని పోలీస్లు చెప్పడం జరిగింది ఆవిడ అన్నారు. ఈ నెల 23వ తేదీ శనివారం ఈ ఘటన జరిగిన ఈరోజుకి మూడో రోజు కావస్తోంది కానీ ఈ ప్రభుత్వం నమ్మకం నీరెత్తనట్టు నిలకడగా ఉండడం విడ్డూరంగా ఉన్నదని తక్షణమే దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని అన్నారు.

## ఆలయాల అభివృద్ధితోనే సనాతనన ధర్మరక్షణ

- ఈటల రాజేందర్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



జయభేరి, ఉప్పల్ :

మన సంస్కృతిని, సనాతన భారతీయ ధర్మాన్ని పరిరక్షించుకోవడానికి ఆలయాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా వుందని మల్కాజిగిరి పార్లమెంటు సభ్యుడు ఈటెల రాజేందర్ అన్నారు. మల్లపూర్ కేబుల్ చౌరస్తాలో శ్రీ రామానుజ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో 54 అడుగుల శ్రీ విశ్వరూప అభయాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణ సుందరీకరణ పనులకు సోమవారంనాడు ఆయన శంఖుస్థాపన చేశారు. ఆలయాలతో ఆధ్యాత్మిక చింతన పెరుగుతుందని, ముఖ్యంగా యువత ప్రశాంత జీవనం గడపడానికి ఇది ఎంతైనా అవసరమని అన్నారు. భక్తుల సౌకర్యార్థం విగ్రహం చుట్టూ రేకుల షెడ్డు నిర్మాణం ఆయనే స్వహస్తాలతో భూమిపూజ చేసి, షెడ్డు పిల్లర్ నిలబెట్టడంతో వైభవంగా ప్రారంభమైంది. శ్రీ రామానుజ సేవాట్రస్టు చైర్మన్ డా. ధనుంజయ కార్యక్రమానికి విచ్చేసిన ఎంపీ ఈటెల రాజేందర్ సహా రాజకీయ ప్రముఖులందరికీ పేరుపేరునా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. శంకుస్థాపన కార్యక్రమం తర్వాత వందలాది భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎన్ వివిఎస్ ప్రభాకర్, స్థానిక కార్పోరేటర్లు పి దేవేందర్ రెడ్డి, ప్రభుదాస్, శాంతి సాయిజెన్ శేఖర్, మాజీ కార్పోరేటర్లు శ్రీనివాస్ రెడ్డి, గొల్లూరి అంజయ్య, విహెచ్ పి అధికార ప్రతినిధి రావినూతల శశిధర్, ఎమ్మార్పిఎస్ నాయకులు బాబు, పలు పార్టీల స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## నల్ల చెరువు కొలనును వెంటనే అందుబాటులోకి తేవాలి

- అధికారులకు సూచించిన కార్పొరేటర్ రజితపరమేశ్వర్ రెడ్డి



జయభేరి, ఉప్పల్ :

ఉప్పల్ నల్ల చెరువు సమీపంలోని కొలనును వెంటనే అందుబాటులోకి తేవాలని కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. కొలనును శుభ్రం చేయడంతో పాటు కొత్త నీటితో నింపాలని సూచించారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఉండేలా సౌకర్యాలను కల్పించాలన్నారు. సోమవారం ఉప్పల్ కార్పొరేటర్ రజితపరమేశ్వర్ రెడ్డి, పరమేశ్వర్ రెడ్డి, మున్సిపల్ అధికారులతో కలిసి కొలనును సందర్శించి చేపట్టాల్సిన పనులను గురించి సూచించారు. ఈ కార్యక్రమంలో డిఈ వెన్నెల్లా గౌడ్, ఏఈ రాజ్ కుమార్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, ట్రాఫిక్ సిఐ నాగరాజు, శానిటేషన్ డిఈ చందన, ఈగ ఆంజనేయులు ముదిరాజ్, తెల్కల మెహన్ రెడ్డి, లింగంపల్లి రామకృష్ణ, సల్లా ప్రభాకర్ రెడ్డి, తుమ్మల దేవి రెడ్డి, సుంకు శేఖర్ రెడ్డి, జనగాం రామకృష్ణ, బుసం రఘునాథ్ రెడ్డి, గొరిగె మహేష్, మంద మురళీకృష్ణ రెడ్డి, అలుగుల అనీల్ కుమార్, అల్వాలా భాస్కర్, వర్కల మధన్ గౌడ్, తోకట రాజు, బకారం అరుణ్, కాటేపల్లి విజయ్ గుప్తా, సతీష్ గౌడ్, నాగూర్ బాషా, చింతకింది శ్రీనివాస్, మల్లికార్జున, ప్రశాంత్ రెడ్డి, బట్కర్ కుమార్, రంగుల శేఖర్, శివ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగాల పేరుతో టోకరా చేస్తున్న వ్యక్తిని పట్టుకున్న పోలీసులు

జయభేరి, నూగూరు/ వెంకటాపురం :

సర్కారీ నౌకరీలు ఇప్పిస్తానంటూ మండలంలో పలువురిని మోసం చేసిన నిందితుడిని పోలీస్ అధికారులు ఎట్టకేలకు పట్టుకున్నారు. సోమవారం నిందితుని అరెస్టు వివరాలను ఏడునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ మీడియాకు వెల్లడించారు. వివరాల్లోకి వెళితే వెంకటాపురం ఎస్సై కే తిరుపతిరావు సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో బస్టాండ్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని తనకి చేయగా అతడు తేజావత్ అనిల్ నాయక్ అని తేలింది. వెంటనే సమాచారం అందుకున్న వెంకటాపురం సిఐ అక్కడికి చేరుకొని కేసు నెంబర్ 163/ 2025 యు/ ఎస్ 420 ఐపీసీలో నిందితుని నిర్ధారించి పంచుల సమక్షంలో పంచనామా నిర్వహించారు. కాగా 2019లో వెంకటాపురం ప్రాంతానికి చెందిన ఒక మహిళకు ట్రాన్స్కొ డిపార్ట్మెంట్లో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి నకిలీ ఐడి కార్డులు నకిలీ ప్రభుత్వ ఉత్తర్వులు చూపించి మోసం చేశాడని, ఆ మహిళ పరిచయాల ద్వారా మండలంలో మరి కొంతమందిని 2022, 22 మధ్యకాలంలో పలువురు మోసగించి సుమారు 72 లక్షల నగదు వసూలు చేసినట్లు తెలిపారు. మోసపోయిన బాధితులు పలుమార్లు బాధితులు కలవడానికి ప్రయత్నించినా అతని తప్పించుకుని తిరుగుతున్నట్లుగా పేర్కొన్నారు.ఇదిలా ఉండగా బాధితులు మోసగించిన నిందితుడిపై ఈనెల 16న కేసు నమోదు కాగా ప్రస్తుతం మళ్ళీ రెండు నకిలీ ఉత్తర్వులతో ప్రజలను మోసం చేయడానికి వచ్చిన అతనిని ఎట్టకేలకు వెంకటాపురం పోలీసులు పట్టుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలను కేవలం అధికారిక వెబ్సైట్ల ద్వారానే ప్రకటిస్తారు. వ్యక్తులు లేదా ఏజెన్సీలు హామీ ఇస్తామని చెప్పి డబ్బులు అడుగుతే నమ్మొద్దు. మోసపూరిత వ్యక్తుల వలలో పడకండి. ఎవరైనా ఇలాంటి సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ఏఎస్పి శివం ఉపాధ్యాయ ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐ ముత్యం రమేష్, ఎస్సై కొప్పుల తిరుపతిరావు,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## ఆర్యవైశ్యులు వ్యాపారాల్లో రాణించాలి

- జీవిబిఎల్ బ్రాండ్ అంబాసిడర్ వైశ్య రత్న లింగా కృష్ణమూర్తి

జయభేరి, మేడ్చల్ :



మేడ్చల్ పట్టణంలో గ్రేటర్ ఆర్యవైశ్య బిసినెస్ లీడర్స్ సమావేశాన్ని జీవిబిఎల్ బ్రాండ్ అంబాసిడర్, వైశ్య రత్న , మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ లింగా కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఓ హోటల్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జీవిబిఎల్ సీఈఓ రాజశేఖర్ మంచి మరియు జీవిబిఎల్ మేడ్చల్ జిల్లా ప్రెసిడెంట్ జిల్లా ప్రసాద్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్యవైశ్యులను వ్యాపార రంగాల్లో ఇంకా అభివృద్ధి చేసేందుకు కొంపల్లి, అల్వాల్, మేడ్చల్ ప్రాంతాల్లోని ఆర్యవైశ్యులను ఒక తాటి పైకి తీసుకొచ్చి సమావేశాన్నీ ఏర్పాటు చేసిన లింగా కృష్ణమూర్తి ని అభినందించారు. మేడ్చల్ ప్రాంతంలో మంత్ర పేరుతో 15 రోజుల్లో ఒక చాప్టర్ ని ఏర్పాటు చేస్తామని 2026 వరకు 2000 వేల మందితో ఆంధ్ర,తెలంగాణ రాష్టాలలో 30 చాప్టర్ లను తయారు చేసి మరింత వ్యాపారాల్లో ఆర్యవైశ్యులను ప్రోత్సాహించడమే జీవిబిల్ లక్ష్యమని అన్నారు. అనంతరం లింగా కృష్ణమూర్తి ని శాలువతో సన్మానించారు. పిలవగానే అందరు వచ్చి సమావేశాన్ని విజయవంతం చేసినందుకు ప్రతి ఒక్కరికి లింగా కృష్ణమూర్తి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తడిశెట్టి క్రాంతి కుమార్,బజ్జూరి సంతోష్ లతో పాటు మేడ్చల్ మరియు కొంపల్లి అల్వాల్ ప్రాంతాలకు చెందిన ఆర్యవైశ్య వ్యాపారులు పాల్గొన్నారు.

## నిబంధన లేకుండా యూరియాను రైతులకు అందించాలి

- బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ అధికారికి వినతి

జయభేరి, వెంకటాపురం, ఆగస్టు 25 :



నిబంధనలు లేకుండా రైతులకు యూరియా బస్తాలు అందజేయాలని బిఆర్ఎస్ శ్రేణులు డిమాండ్ చేశారు.ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలోని స్థానిక వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయంలో మండల వ్యవసాయ శాఖ అధికారి నవీన్ కు వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మాట్లాడుతూ నిబంధనలు పేరుతో రైతుకు యూరియా బస్తా కోత విధించడం సరికాదన్నారు. రైతు వ్యవసాయ అవసరాలకు తగినట్టుగా యూరియా బస్తాలను సకాలంలో అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రూ 250 రూపాయలుకు అమ్మాల్సిన యూరియాను బ్లాక్ మార్కెట్లో 350 రూపాయల వరకు భూపాలపట్నం రోడ్డు మార్గంగా మహారాష్ట్ర చతిస్గడ్ పలు రాష్ట్రాలకు మార్కెట్లో ఎగుమతి చేస్తున్నారని ఆరోపించారు. దీంతో యూరియా దొరకక రైతాంగం నష్టపోతున్నారని ఇతర జిల్లాలకు రాష్ట్రాలకు యూరియా తరలి వెళ్లకుండా పగడ్బందీగా చెక్ పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేయాలని ఉన్నత అధికారులకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ అధికార ప్రతినిధి దర్ర దామోదర్,సీనియర్ నాయకులు వేల్పూరి లక్ష్మీనారాయణ, ముదుంబా శ్రీనివాస్, జాగర్ శివాజీ యాదవ్, నామన సాయి,పర్షిక పగిడిద్ద రాజు, మహిళా అధ్యక్షురాలు పెనుమత్స మాధురి తదితరులు పాల్గొన్నారు.

## కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం చేసిన హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ

జయభేరి, పరవాడ:



పరవాడ మండలం, కన్నూరు శివారు మామిడివానిపాలెం గ్రామంలో శీరంశెట్టి నరసింగరావు కొంతకాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతూ అనారోగ్యంతో మంచాన పడ్డ విషయం తెలిసిందే, అయితే గత కొన్ని రోజులుగా వివిధ పత్రికల్లో ఈ వార్త ప్రచురించడం ద్వార అగనంపూడి గ్రామానికి చెందిన ఫ్రెండ్స్ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ వారు మామిడివానిపాలెం గ్రామానికి చేరుకొని బాధితుడికి నెల సరిపడా నిత్యవసర సరుకులు, కొంత నగదుని ఆర్థిక సహాయం అందించారు.

ఈ కార్యక్రమంలో సహాయధికారి డాక్టర్ సీహెచ్ తాతాజీ మాట్లాడుతూ ఈ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ పెట్టిన దగ్గర నుంచి ప్రతీ రెండో ఆదివారం ఏదోక సేవ కార్యక్రమం చేపడుతుందని ఈ ఆదివారం నరసింగరావు కి ఆర్థిక సహాయం చెయ్యాలని మేమంతా ముందుకు వచ్చామని అని అన్నారు అలాగే వారి పిల్లలకి చదువులకి ఉపయోగపడేలా కొంత నగదు కూడా ఇస్తున్నామని తెలిపారు.ఇంతే కాకుండా ఎవరైతే నిరుపేదలున్నారో ఎవరైతే పనులు చేసుకోలేక పేదరికంతో ఇబ్బంది పడుతు బాధ పడుతున్నారో వాళ్లకు ముందుగా ఉండి సహాయం చెయ్యడమే మా ప్రధాన లక్ష్యమని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులు డాక్టర్ సిహెచ్ తాతాజీ.వ్యవస్థాపకులు, గెద్దాడ రమేష్. రూకన రాము. ఉదయ్. ఈశ్వరావు. వర్మ. రామకృష్ణ. సూర్య. మడక నూక నాగ సత్తి బాబు. మామిడి నాగరాజు. మామిడి దార్రాజు మామిడి వెంకటేష్. మామిడి మహేష్. మడక రాంబాబు. మామిడి శివ. పాల్గొన్నారు.




## రైతుల రుణ మాఫీ ట్రాక్టర్ల యాత్రలో పాల్గొన్న ఏనుగు సుదర్శన్ రెడ్డి

జయభేరి, ఘట్కేసర్ :


ఘట్కేసర్ రైతు సహకార సంఘం పరిధిలో 1189 మంది రైతుల రుణమాఫీ చేయకుండా వారికి మొండి చేయి చూపి ప్రశ్నించిన ప్రతిసారి కల్లబొల్లి మాటలతో కాలం వెళ్లదీస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోమవారం ఘట్కేసర్ నుండి కలెక్టరేట్ వరకు నిర్వహించిన ట్రాక్టర్ల ర్యాలీలో పాల్గొన్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మరియు మేడ్చల్ నియోజకవర్గ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి ఏనుగు సుదర్శన్ రెడ్డి. తమ ప్రాంత రైతుల ఆవేదనను వారికి జరిగిన అన్యాయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తెచ్చేందుకు నిర్వహిస్తున్న ట్రాక్టర్ల ర్యాలీని కలెక్టరేట్ గేటు వద్ద అడ్డుకున్న పోలీసులు,ఈ విషయంపై ఆగ్రహాన్ని వ్యక్తం చేసిన సుదర్శన్ రెడ్డి గేటు వద్దనే బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఆ తర్వాత ప్రజా ప్రజావాణి నిర్వహిస్తున్న అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తాని కలిసి వినతిపత్రం అందజేసి ప్రభుత్వం తక్షణమే రుణమాఫీ అమలు పరచి రైతులకు న్యాయం చేయాలని కోరడం జరిగింది.

## కస్టమర్ల నమ్మకాన్ని గెలుచుకోవడానికి కృషి చేస్తా




జయభేరి, మేడిపల్లి :

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన "అమర్ మోటర్స్ సేల్స్ & సర్వీస్ సెంటర్" ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాజీ మంత్రి, మేడ్చల్ శాసన సభ్యులు చామకూర మల్లారెడ్డి, మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు కొల్తూరి మహేష్, దొంతిరి హరిశంకర్ రెడ్డి, లేతాకుల మాదవి రఘుపతి రెడ్డి, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి కలిసి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పీర్జాదిగూడ పరిసర ప్రాంతాల ప్రజలకు వాహనాల విక్రయం, మరమ్మత్తులు, సేవలు ఒకే దగ్గర లభించటం సంతోషకరమని పేర్కొన్నారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కలిగే విధంగా సెంటర్ అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అమర్ మోటర్స్ యాజమాన్యం మాట్లాడుతూ, వినియోగదారులకు అత్యాధునిక సదుపాయాలు, నాణ్యమైన సర్వీసులు అందించడమే తమ లక్ష్యమని, స్థానిక కస్టమర్ల నమ్మకాన్ని గెలుచుకోవడానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బోడుప్పల్ బీఆర్ఎస్ అధ్యక్షులు మంద సంజీవరెడ్డి, పోచారం మాజీ వైస్ చైర్మన్ రెడ్యానాయక్, చెరుకు పెంటయ్య,జావీద్ ఖాన్, ప్రభు, జిలాని పాషా, యాసారం శ్రీనివాస్, అశోక్, శ్రీకాంత్, శంకర్ రావు,అమర్ పటేల్, మధు, కిరణ్ నాయక్, రాజశేఖర్రెడ్డి, సందీప్ రెడ్డి తదితరులు పాల్గొని యజమానులకు శుభాకాంక్షలు తెలిపారు.



## ఏంటి.. ఈ గందరగోళం.. చంద్రబాబుకి చిరంజీవి విరాళం ఇచ్చినట్టా, ఇవ్వనట్టా?

సినిమాల్లో మెగాస్టార్ అయినా, నిజ జీవితంలో మానవతావాదిగా పేరు తెచ్చుకున్న చిరంజీవి, తన సేవా కార్యక్రమాలతో ఎప్పటికప్పుడు అభిమానుల మన్ననలు పొందుతున్నాడు. ఆయన స్థాపించిన చిరంజీవి ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా రక్తదానం, నేత్రదానం, వైద్య సేవలు, ఆక్సిజన్ బ్యాంక్ వంటి ఎన్నో సేవలు ప్రజలకి అందుతున్నాయి. ఆపద సమయంలో ఎన్నో కుటుంబాలకు చిరంజీవి ఆపద్బాంధవుడిగా నిలిచారు.అయితే రీసెంట్ గా చిరంజీవి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయనిధికి రూ. 1 కోటి విరాళం ఇచ్చారనే వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అభిమానులు షేర్ చేసిన సమాచారం ప్రకారం, చిరంజీవి స్వయంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిసి చెక్ అందజేశారట. ఇందుకు సంబంధించిన ఫోటోలు, పోస్టులు నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. అయితే, ఇప్పటివరకు ఈ విరాళానికి సంబంధించిన ఏ అధికారిక ప్రకటన చిరంజీవి టీమ్ నుంచి వెలువడలేదు. అలాగే, ఏపీ సీఎంఓ తరఫున కూడా ఈ విషయంపై ఎలాంటి సమాచారం బయటకు రాలేదు. విరాళం ఇచ్చారన్నట్లు కొన్ని ప్రముఖ సోషల్ మీడియా అకౌంట్లు చేసిన పోస్టులు కూడా తర్వాత తొలగించబడ్డాయి. ఈ నేపథ్యంలో అసలు నిజం ఏంటి? చిరు నిజంగా మరోసారి విరాళం ప్రకటించారా? అనే సందేహాలు అభిమానుల్లో మొదలయ్యాయి. నిజానికి, 2024 అక్టోబర్‌లో ఏపీలో భారీ వర్షాలు, వరదల సమయంలో చిరంజీవి, రామ్ చరణ్ కలిసి రూ. 1 కోటి విరాళం ప్రకటించి, అదే సమయంలో చంద్రబాబు నాయుడిని కలిసి చెక్ అందజేశారు. ఆ సమయంలో తీసిన ఫోటోలు, వీడియోలు అప్పట్లోనే వైరల్ అయ్యాయి. ఇప్పుడు ఆ పాత ఫోటోలనే తిరిగి వైరల్ చేస్తూ కొత్తగా విరాళం ఇచ్చారనే ప్రచారం జరుగుతుండటంతో అసలు నిజం ఏంటని తెలుసుకోవాలని అభిమానులు ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. చిరంజీవి తాను చేసిన సాయం గురించి ఎప్పుడూ ప్రచారం చేసుకోవడాన్ని ఇష్టపడడు. ఇటీవలే తమిళ నటుడు పొన్నాంబళం, తనకు చిరు అందించిన ఆర్థిక సాయాన్ని గురించి మాట్లాడుతూ చేసిన వీడియో కూడా సోషల్ మీడియాలో వైరల్ అయింది. మరి ఇప్పుడు వైరల్ అవుతున్న ఈ డొనేషన్ వార్తలపై చిరంజీవి టీమ్ నుంచి ఓ క్లారిటీ రావాలని అభిమానులు కోరుతున్నారు.

## నాన్‌స్టాప్ షూట్‌లో ‘రాజా సాబ్’



అగ్ర హీరో ప్రభాస్ నాన్‌స్టాప్ షెడ్యూళ్లతో వరుసగా తన సినిమాలను పూర్తి చేసే పనిలో ఉన్నారు. ప్రస్తుతం ఆయన ‘ఫౌజీ’ ‘ది రాజా సాబ్’ చిత్రాల్లో నటిస్తున్నారు. సెప్టెంబర్ నెలాఖరులో ‘స్పిరిట్’ సెట్స్‌మీదకు వెళ్లనుంది. ఈ నేపథ్యంలో మారుతి దర్శకత్వంలో రూపొందిస్తున్న ‘ది రాజాసాబ్’ షూటింగ్ షెడ్యూల్స్ గురించి ఆసక్తికరమైన అప్‌డేట్ వెలువడింది. సోమవారం హైదరాబాద్‌లో మొదలైన తాజా షెడ్యూల్‌లో ప్రభాస్ కూడా పాల్గొంటున్నారని సమాచారం. దీని తర్వాత సెప్టెంబర్‌లో కేరళలో ప్రభాస్ ఉపోద్ఘాత గీతాన్ని చిత్రీకరిస్తారని చెబుతున్నారు. రెండు పాటల్ని విదేశాల్లో తెరకెక్కించేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారని, దాంతో షూటింగ్ మొత్తం పూర్తవుతుందని తెలిసింది. హారర్ కామెడీ డ్రామాగా తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ కథానాయికలుగా నటిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రం డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమా తర్వాత ప్రభాస్ ‘స్పిరిట్’ షూట్‌లో జాయిన్ కాబోతున్నారు.



## నా టాలెంట్ ఏంటో చూపిస్తా..

సమంత తెలుగులో సినిమాలు చేయక చాలా రోజులైపోయింది.. విజయ్ దేవరకొండ ఖుషీ తర్వాత ఈమె మళ్లీ తెలుగులో కనబడలేదు. సినిమాలు చేసినా చేయక పోయినా నిత్యం ఏదో ఓ వార్తతో న్యూస్‌లో అయితే ఉంటారు సమంత. ఇప్పుడు కూడా ఇదే జరుగుతుంది. మొన్నామధ్య నిర్మాతగా మారారు స్యామ్. ట్రలాలా ప్రొడక్షన్ మొదలుపెట్టి శుభం అంటూ సినిమా నిర్మించారు.. అది బాగానే ఆడింది కూడా.. మా ఇంటి బంగారం అంటూ త్వరలోనే మరో సినిమాతో రానున్నారు ఈ బ్యూటీ. తెలుగులో రీ ఎంట్రీ కోసం చాలా కాలంగా వేచి చూస్తున్నారు సమంత. కానీ సరైన స్క్రిప్ట్ రావట్లేదు.. రెమ్యునరేషన్ కోసమే సినిమాలు చేసే స్థాయి తానెప్పుడో దాటేసానని.. ఇప్పుడేదైనా సినిమా చేస్తే కనీసం ఆడియన్స్ తనని గుర్తు పెట్టుకోవాలి అంటున్నారు సమంత. ఈ క్రమంలోనే ఈమె నటిగా కాకుండా.. డైరెక్టర్‌గా మారే ఆలోచన చేస్తున్నారిప్పుడు. కొన్నాళ్లుగా ఖాళీగానే ఉన్న సమంత.. ఈ గ్యాప్‌లో ఓ కథ సిద్ధం చేసారని తెలుస్తుంది. కొత్త వాళ్లతో సొంత నిర్మాణంలోనే సినిమాను తెరకెక్కించే ప్రయత్నాలు చేస్తున్నారు ఈ బ్యూటీ. అన్నీ కుదిర్తే త్వరలోనే సినిమా సెట్స్‌పైకి తెచ్చి.. 2026లో విడుదల చేయాలని చూస్తున్నారు. మరి నటిగా, నిర్మాతగా సక్సెస్ అయిన సమంత.. దర్శకురాలిగా ఏం చేస్తారనేది చూడాలి.



## ఒక్క హిట్టు మాత్రమే..

సినీరంగంలో ఎన్నో సంవత్సరాలుగా రాణిస్తున్న చాలా మంది హీరోయిన్లు ఇప్పటికీ సరైన సక్సెస్ అందుకోలేకపోయారు. వరుసగా స్టార్ హీరోలతో సినిమాలు చేసినప్పటికీ బ్రేక్ రాని ముద్దుగుమ్మలు ఉన్నారు. కానీ ఇప్పుడు మనం మాట్లాడుకుంటున్న ఓ హీరోయిన్ మాత్రం ప్రత్యేకం. వరుసగా స్టార్ హీరోల సినిమాల్లో అవకాశాలు వస్తున్నాయి. హీరోయిన్ నిధి అగర్వాల్. 2017లో మున్నా మైఖేల్ సినిమాతో బాలీవుడ్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది. ఆ తర్వాత 2018లో సవ్యసాచి సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది. ఫస్ట్ మూవీ అంతగా ఆకట్టుకోలేకపోయింది. అయినప్పటికీ ఈ బ్యూటీకి వరుస అవకాశాలు వచ్చాయి. తెలుగులో మిస్టర్ మజ్ను, హీరో వంటి చిత్రాల్లో నటించింది. తెలుగుతోపాటు తమిళంలోనూ పలు అవకాశాలు అందుకుంది. 2019లో వచ్చిన ఇస్మార్ట్ శంకర్ మాత్రమే బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్టు అయ్యింది. ఈ మూవీతో ఏకైక విజయాన్ని అందుకుంది. ఇటీవలే పవన్ కళ్యాణ్ సరసన హరి హర వీరమల్లు సినిమాతో అడియన్స్ ముందుకు వచ్చింది. ఈ సినిమాకు పాజిటివ్ టాక్ వచ్చింది. ప్రస్తుతం ఈ అమ్మడు ప్రభాస్ సరసన రాజా సాబ్ చిత్రంలో నటిస్తుంది. ఈ సినిమాతో సరైన బ్రేక్ కోసం చూస్తుంది. డైరెక్టర్ మారుతి దర్శకత్వం వహిస్తున్న పాన్ ఇండియా మూవీ రాజా సాబ్ ఈ ఏడాదిలో విడుదల కానుంది. ఈ సినిమాతోపాటు నిధికి తెలుగు, తమిళం భాషలలో మరిన్ని ఆఫర్స్ వస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది.

## ఆ తల లేని మొండెం ఎవరిది?



గత వారం ఓటీటీలోకి పలు కొత్త సినిమాలు, ఆసక్తికర వెబ్ సిరీస్ లు వచ్చాయి. తెలుగుతో పాటు వివిధ భాషలకు చెందిన చిత్రాలు, సిరీస్ లు స్ట్రీమింగ్ కు వచ్చాయి. అయితే ఇందులో ఒక తెలుగు క్రైమ్ థ్రిల్లర్ మూవీ ఓటీటీ ఆడియెన్స్‌ను తెగ ఆకట్టుకుంటోంది. ఈ చిత్రం ఆగస్టు 23, 2024న థియేటర్లలో విడుదలైంది. సస్పెన్స్ థ్రిల్లర్ జానర్ కావడంతో ఓ మోస్తరుగా ఆడింది. ఐఎమ్ డీబీలోనూ 8.6/10 రేటింగ్ అందుకుంది. అయితే పేరున్న నటీనటులు లేకపోవడంతో లాంగ్ రన్ కొనసాగించలేకపోయింది. థియేటర్లలో యావరేజ్ గా నిలిచిన ఈ క్రైమ్ థ్రిల్లర్ మూవీ సుమారు ఏడాది తర్వాత గత వారమే ఓటీటీలోకి వచ్చింది. ఇప్పుడీ సినిమాను ఓటీటీ ఆడియెన్స్ ఎగబడి చూస్తున్నారు. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. పోలీస్ స్టేషన్ సమీపంలో తల లేని శవం కనిపించే సీన్ తో మూవీ స్టార్ట్ అవుతుంది. ఈ శవం ఎవరిది ? హంతకుడు ఎవరు ? పోలీస్ స్టేషన్ లో ఎందుకు శవాన్ని వదిలాడు? అనే ప్రశ్నలతో పోలీసులు కేసును దర్యాప్తును ముమ్మరం చేస్తారు. కట్ చేస్తే.. స్టోరీ మూడు నెలలు వెనక్కు వెళుతుంది. చైత్ర అనే అమ్మాయి ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. అమెరికా నుంచి తన స్వగ్రామానికి తిరిగి వస్తుంది. సూర్య అనే యువకుడిని ప్రేమిస్తుంది. అతను కూడా ఆమెను ప్రాణంగా ప్రేమిస్తాడు. దీనికి సమాంతరంగానే గౌతమ్ అనే యువకుడి కథ కూడా రన్ అవుతుంటుంది. జులాయిగా తిరిగే గౌతమ్ జీవితంలో కొన్ని షాకింగ్ సీక్రెట్స్ ఉంటాయి. ఇవి ఒక హత్యకు దారితీస్తాయి. ఇది తల లేని శవానికి కనెక్ట్ అవుతుంది. మరి ఆ మృతదేహం ఎవరిదో పోలీసులు గుర్తించారా? ఆ హత్య ఎవరు చేసారు ? ఎందుకు చేశారు ? పోలీసుల దర్యాప్తులో తేలిందేంటి? అనే ప్రశ్నలకు సమాధానాలు తెలియాలంటే ఈ క్రైమ్ థ్రిల్లర్ మూవీని చూడాల్సిందే. ఎవరూ ఊహించని ట్విస్టులు, షాకింగ్ క్లైమాక్స్ తో ఎండ్ అయ్యే సినిమా పేరు బ్రహ్మావరం పీఎస్ పరిధిలో. ఇమ్రాన్ శాస్త్రి తెరకెక్కించిన ఈ తెలుగు మూవీలో మూవీలో గురు చరణ్, సూర్య శ్రీనివాస్, స్రవంతి బెల్లంకొండ, బలగం రూప లక్ష్మి, యాంకర్ హర్షిణి, సమ్మెట గాంధీ, జీవా, ప్రేమ్ సాగర్, రుద్ర తిప్పే స్వామి తదితరులు నటించారు. ప్రస్తుతం అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఈ మూవీ స్ట్రీమింగ్ అవుతోంది. సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్స్ ఇష్టపడేవారికి ఈ మూవీ ఒక మంచి ఛాయిస్ అని చెప్పవచ్చు.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. **Cell: 9391 544 889. RNI No: TGTEL/25/A0314.** email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com